సాక్షి నల్లగొండ

శుక్రవారం । 19 । జులై । 2024



ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

రైతుల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. - 8లో



పార్థి గ్యాంగ్ సభ్యుడి అరెస్ట్

దోపిడీలకు పాల్పడుతున్న పార్థి గ్యాంగ్ లోని మరో సభ్యుడిని నల్లగొండ పోలీసులు మహారాష్ట్రలో అరెస్ట్ చేశారు. - 8లో

గరిష్టం / కనిష్టం

31°/ 24°

వాతావరణం


ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నల్లగొండ: జిల్లాలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో రెండో విడత ప్రవేశాలకు ఈనెల 21 వరకు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నర్సింహాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25, 2025–26 సంవత్సరాల్లో (ఏడాది, రెండేళ్ల కోర్సుల్లో) చేరాలనుకునే ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులను ఆన్‌లైన్ వెబ్‌సైట్ iti.telangana.gov.in లో సమర్పించాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు మొబైల్ నంబర్ కూడా రిజిస్టర్ చేసుకుంటే సమాచారం మొత్తం ఎస్ఎంఎస్ ద్వారా మొబైల్ నంబర్‌కు వస్తుందని తెలిపారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



శ్రీస్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో గురువారం నిత్యపూజా కైంకర్యాలు సంప్రదాయ రీతిలో కొనసాగాయి. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు.. స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను హారతితో కొలిచారు. వేదమంత్రాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చన చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో గజవాహన సేవ, నిత్య తిరుకల్యాణం, బ్రహ్మోత్సవం వేడుకలను ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం వేళ జోడు సేవలను మాడ వీధిలో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన , నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్క పూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు పూర్తిగావించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు.

నేడు ఎడమ కాల్వకు నీటి విడుదల

- కుడి కాల్వకు కొనసాగింపు



కుడి కాల్వలో పారుతున్న నీరు

నాగార్జునసాగర్: సాగర్ జలాశయం ఎడమ కాల్వకు శుక్రవారం నీటిని విడుదల చేయనున్నట్టు సాగునీటి శాఖ ఇంజనీర్లు తెలిపారు. కుడి కాల్వకు బుధవారం రాత్రినుంచే నీటిని విడుదల చేస్తున్నారు. గత సోమవారం హైదరాబాద్‌లోని జలసౌదలో కృష్ణానది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. నాగార్జునసాగర్ జలాశయంలో నీటినిల్వలు అడుగంటిన దృష్ట్యా శ్రీశైలం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా 5.7టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు నిర్ణయించి మంగళవారం నుంచే వదులుతున్నారు. నాగార్జునసాగర్ జలాశయంలో 500అడుగుల మీద లభ్యమయ్యే నీటితో కలిపి కుడి కాల్వల ద్వారా ఏపీకి 4.5టీఎంసీలు, ఎడమకాల్వ ద్వారా తెలంగాణకు 5.4టీఎంసీలను విడుదల చేయనున్నారు.

21న జిల్లా స్థాయి క్రికెట్ జట్ల ఎంపిక

మిర్యాలగూడ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆదేశాల మేరకు నల్లగొండ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో అండర్– 25, 19, 16 క్రికెట్ జట్ల ఎంపికకు ఓపెన్ సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తున్న ట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నాయిని శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. ఈనెల 21న మిర్యాలగూడ హౌసింగ్‌బోర్డులోని క్లియోస్పోర్ట్స్‌లో మధ్యాహ్నం 1.30గంటలలోగా వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు వయస్సు ధ్రువీకరణ పత్రం(ఒరిజినల్), ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతోపాటు సొంత కిట్‌తో రావాలని సూచించారు. వివరాలకు 94909 99316నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్‌ఇన్



నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందా.. ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో నిండుకు పోయాయా.. డ్రెయినేజీలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా, అయితే మీ సమస్యలపై నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో శుక్రవారం 'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.



కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్

తేది. 19.07.2024 శుక్రవారం

సమయం : ఉదయం 10.00 నుంచి 11.00 గంటల వరకు

డయల్ చేయాల్సిన ఫోన్ నంబర్ : **70139 57178**

రూ. 941.29 కోట్లు మాఫీ

రూ.లక్షలోపు రుణమాఫీ పొందిన రైతులు ఉమ్మడి జిల్లాలో 1,76,683 మంది

- కొత్త జిల్లాల వారీగా చూస్తే.. రాష్ట్రంలోనే నల్లగొండలో అత్యధిక మందికి లబ్ధి
- ఇక్కడ రూ.454.49 కోట్లు మాఫీ పొందిన 82,124 మంది రైతులు
- రుణమాఫీ జాబితాలో తమ పేర్లు లేవని పలువురి రైతుల ఆవేదన
- ఆ లెక్కలు తమకు తెలియదంటున్న లీడ్ బ్యాంకు



సీఎం వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని గురువారం పండుగ వాతావరణంలో నిర్వహించింది. రూ.2 లక్షల లోపు రుణమాఫీ కింద మొదటి విడతలో రూ.లక్షలోపు రుణం ఉన్న రైతులకు రుణ విముక్తి కల్పించింది. రూ.లక్షలోపు రుణ మాఫీ కింద నల్లగొండ జిల్లాలో 82,124 మంది రైతులకు రూ.454.49 కోట్లు ఇచ్చింది. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లాకు అత్యధికంగా రుణమాఫీ నిధులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాకు రూ.941.29 కోట్లు

మొత్తంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 1,76,683 మంది రైతులకు రూ.941.29 కోట్లు రుణ మాఫీ కింద ఇచ్చినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) నుంచే రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న రైతులు 72,513 మంది ఉన్నారు. వారు రూ.316.5 కోట్ల రుణాలు తీసుకున్నారు. మిగతా వారు ఇతర కమర్షియల్ బ్యాంకుల నుంచి తీసుకున్నారు. వారి రుణాలు అన్నీ మాఫీ అవుతాయని అధికారులు పేర్కొన్నారు. అయితే ఎంతమందికి పంట రుణాలు మాఫీ అయ్యాయనే సమాచారం గురువారం సాయంత్రం వరకు బ్యాంకులకు అందలేదు. రాత్రి వరకు క్రెడిట్ అయ్యే అవకాశం ఉంటుందని బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి.

జాబితాలో పేర్లు లేనివారిలో ఆందోళన

జిల్లాలోని కమర్షియల్ బ్యాంకుల నుంచి రూ.లక్ష లోపు రుణాల తీసుకున్న వారి జాబితాలో వేల మంది రైతుల పేర్లు లేకుండా పోయాయి. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన అర్హుల జాబితాలో తమ పేర్లు లేవని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామంలోని పలువురు రైతులు ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, యూనియన్ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారు. కనగల్ మండలం చెర్లగౌరారం గ్రామంలో పలువురు రైతుల ఏపీజీవీబీ నల్లగొండ డీవీకే రోడ్డు బ్రాంచి నుంచి రుణాలు తీసుకున్నారు. వారి పేర్లు కూడా జాబితాలో రాలేదు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పొందే వారి జాబితాలో గ్రామానికి చెందిన కొంతమంది రైతుల పేర్లు లేకపోవడంపై బ్యాంకు అధికారులను అడిగితే తాము జాబితాను పంపించలేదని, హెడ్ ఆఫీస్ నుంచే ప్రభుత్వం జాబితాను తీసుకుందేమోనని సమాధానం చెబుతున్నారు.

నామమాత్రంగా లీడ్ బ్యాంకు

రైతులకు పంట రుణాలు ఇచ్చేందుకు రాష్ట్ర స్థాయిలో స్టేట్ లెవల్ బ్యాంకింగ్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) ఉండగా, జిల్లాలో లీడ్ బ్యాంకు, లీడ్ బ్యాంకు మేనేజర్ ఉంటారు. ఎస్ఎల్‌బీసీకి అవసరమైన రైతులు, రుణాల సమాచారం జిల్లాలోని అన్ని బ్యాంకుల నుంచి సేకరించి అందించాల్సింది లీడ్ బ్యాంకే. అయితే, రుణమాఫీకి సంబంధించిన వివరాలు లీడ్ బ్యాంకు వద్ద, లీడ్ బ్యాంకు మేనేజర్ వద్ద ఉండాలి. ఆ వివరాలేవీ సమగ్రంగా లేవని లీడ్ బ్యాంకు వర్గాలే పేర్కొంటున్నాయి. రూ.లక్షలోపు రుణాలు, రూ.లక్షపైగా, రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న వారి వివరాలు తమ వద్ద లేవని, రైతు రుణమాఫీకి సంబంధించిన అన్ని వివరాలను అన్ని బ్యాంకుల హెడ్ ఆఫీస్‌ల నుంచి ఎస్ఎల్‌బీసీనే తీసుకొని ప్రభుత్వానికి ఇచ్చి ఉంటుందని చెబుతున్నాయి. ఒకవేళ ఎవరివైనా మిస్ అయితే తరువాత వారికి కూడా మాఫీ చేస్తారని వివరిస్తున్నారు.

రూ.2 లక్షలలోపు రుణమాఫీ లెక్కలు తేలాల్సి ఉంది

రూ.2 లక్షలలోపు రుణమాఫీ లెక్కలు ఇంకా తేలాల్సి ఉంది. త్వరలోనే వాటికి సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుంది. అయితే జిల్లాలో ఎంతమంది ఉన్నారనే వివరాలు జిల్లా లీడ్ బ్యాంకు వద్ద లేవని చెబుతున్నారు. అయితే డీసీసీబీలో రూ.లక్షకు పైగా రూ.2లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతులు 16,575 మంది ఉండగా.. వారు తీసుకున్న రుణాలు రూ.183.43 కోట్లు ఉన్నాయి. కమర్షియల్ బ్యాంకుల వివరాలు లేవని అధికారులు పేర్కొంటున్నారు.

రూ.లక్షలోపు రుణమాఫీ లెక్కలు ఇలా..

జిల్లా	అకౌంట్లు	మాఫీ సొమ్ము (రూ. కోట్లలో)
నల్లగొండ	83,124	454.49
సూర్యాపేట	56,274	282.98
యాదాద్రి	37,285	203.82

నియోజకవర్గాల వారీగా రూ.లక్షలోపు రుణమాఫీ వివరాలు (రూ. కోట్లలో)

నియోజకవర్గం	అకౌంట్లు	మాఫీ మొత్తం
నల్లగొండ	8,358	46.16
నకిరేకల్	15,042	82.22
దేవరకొండ	17,239	98.37
మిర్యాలగూడ	12,975	64.34
నాగార్జునసాగర్	17,176	92.08
మునుగోడు	17,050	98.46
సూర్యాపేట	11,637	62.41
తుంగతుర్తి	17,357	97.50
హుజూర్‌నగర్	16,522	80.05
కోదాడ	16,868	76.99
భువనగిరి	10,010	52.58
ఆలేరు	16,449	90.11



దేవరకొండలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వం

- సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో నిలిచిపోయారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వమని రుజువైందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గురువారం మొదటి విడతలో భాగంగా రూ.లక్ష రుణ మాఫీ వేడుకలను చేపట్టింది. ఈ సందర్భంగా రైతులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి.. తిప్పర్తికి చెందిన రైతు గుండె రాజుతో మాట్లాడి రుణమాఫీ పట్ల అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని నిలబెట్టినందుకు ఈ సందర్భంగా సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని.. మీరు రైతుల గుండెల్లో నిలిచిపోయారంటూ సీఎం రేవంత్‌రెడ్డిని కొనియాడారు. నల్లగొండ జిల్లాలో రైతులు రుణ మాఫీ పట్ల పండుగ చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో రూ.481 కోట్ల రుణమాఫీ చేయడంతో అత్యధిక మంది రైతులకు మేలు జరిగిందన్నారు. ముందుగా గడియారం సెంటర్ నుంచి మంత్రి కోమటిరెడ్డి స్వయంగా ట్రాక్టర్ నడుపుతూ రైతులతో కలిసి ర్యాలీగా ఎంఎస్ఆర్ గార్డెన్స్‌కు వచ్చారు.

దేశ చరిత్రలోనే గొప్ప నిర్ణయం

రైతులకు రుణమాఫీ చేయడం దేశ చరిత్రలోనే గొప్ప నిర్ణయమని మంత్రి వెంకట్‌రెడ్డి అన్నారు. రుణమాఫీపై సందేహాలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రూ.లక్ష రుణమాఫీ విషయంలో రైతులకు ఇబ్బంది జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, నాయకులు గుమ్మల మోహన్‌రెడ్డి, పాశం రాంరెడ్డి, మాజీ జెడ్పీటీసీలు, వ్యవసాయ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

22 నాటికి రుణమాఫీ సొమ్ము జమచేయాలి



బ్యాంకర్లతో జరగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ: రైతుల రుణమాఫీ సొమ్ము మొత్తం ఈనెల 22 నాటికి వారి ఖాతాల్లో జమచేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి బ్యాంకర్లకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. గురు, శుక్రవారాల్లో రూ.లక్ష రుణాలు ఉన్న రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమ చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందన్నారు. రుణమాఫీ పొందిన రైతులకు బ్యాంకు రుణాలను రెన్యువల్ చేయాలని ఆదేశించారు. వచ్చే సోమవారం నుంచి వారం పాటు ×రుణాల రెన్యువల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. రుణమాఫీ సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామన్నారు. రుణ మాఫీ సందేహాలపై రైతులు ఫోన్ : 7288800023 నంబర్‌ను సంప్రదించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో కూడా రుణమాఫీకి సంబంధించిన సమస్యలు తెలుపడానికి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ రూ.లక్షలోపు పంట రుణాలు పొందిన రైతులు జిల్లాలో 83 వేల మంది ఉన్నారన్నారు. ఎల్‌డీఎం శ్రామిక్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రూ.7,417 కోట్ల రుణాలు ఇచ్చి లక్ష్యాలు సాధించామన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకుల అనుసంధానంతో రూ.260 కోట్ల రుణాలను ఇచ్చి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన బ్యాంకర్లను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్ రూ.15,811.91 కోట్ల అంచనాతో రూపొందించిన 2024– 25 జిల్లా వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేశారు. సమావేశంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ఎస్‌బీఐ ఆర్ఎం అలీముద్దీన్, నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వినయ్‌కుమార్, ఆర్బీఐ ఏజీఎం సాయితేజరెడ్డి పాల్గొన్నారు.

రైతులెవరూ ఓటీపీ నంబర్ చెప్పొద్దు

రుణమాఫీకి సంబంధించి ఎవరు ఫోన్ చేసినా రైతులు మాత్రం ఓటీపీ నంబర్లు చెప్పవద్దని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని రైతులు గుర్తుంచుకోవాలన్నారు. మీ పంట రుణమాఫీకి సంబంధించి బ్యాంకు ఖాతా నంబర్, ఓటీపీ, ఆధార్ కార్డు నంబర్ చెప్పాలని బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని చెప్పి మోసం చేస్తారని, వారి మాటలను నమ్మి వివరాలు చెప్పవద్దన్నారు. రైతులు బ్యాంకులను సంప్రదించి వారు రుణమాఫీ పొందింది.. లేనిది వారి ఖాతాల్లో నిధులు జమ అయ్యింది.. లేనిది తెలుసుకోవచ్చన్నారు. వ్యవసాయ, బ్యాంక్ అధికారుల నుంచి మాత్రమే వివరాలు తెలుసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఎవరి మేలుకు.. ఆ నిబంధనలు?

- రూ.2 కోట్ల పనులకు రూ.10 కోట్ల టర్నోవర్ ఉండాలని కండీషన్
- కేజీబీవీ సరుకుల సరఫరా టెండర్ నిబంధనలపై విమర్శలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో, అర్బన్ రెసిడెన్షియల్ స్కూళ్లలో (యూఆర్ఎస్) ఈ విద్యా సంవత్సరంలో పలు రకాల సరుకుల సరఫరా కోసం నిర్వహించిన టెండర్ నిబంధనలపై పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా, పక్క జిల్లాల్లోనూ పెట్టని నిబంధనలను నల్లగొండలోనే ఈసారి పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకు.. రూ.2 కోట్ల పనులకు రూ.10 కోట్ల టర్నోవర్ ఉండాలన్న నిబంధనలు విధించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఒకరిద్దరికే పనులను కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది.

ఇటీవల టెండర్లను ఆహ్వానించిన విద్యాశాఖ

కేజీబీవీలు, యూఆర్ఎస్‌లకు పాలు, గుడ్లు, కిరాణం , పండ్లు, కూరగాయలు, చికెన్ సరఫరా చేసేందుకు సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ) టెండర్లను ఆహ్వానించింది. ఆ టెండర్లను పిలిచే క్రమంలో జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ సమావేశంలో నిబంధనలను రూపొందించారు. ఈ క్రమంలోనే ఒకరిద్దరు కాంట్రాక్టర్లకు మేలు చేకూర్చుతూ పనులను అప్పగించేలా ఈ నిబంధనలను రూపొందించారని, చిన్న కాంట్రాక్టర్ల అవకాశం లేకుండా నిబంధనలు మార్చారని ఆరోపిస్తున్నారు. దాని ప్రకారమే ఈనెల 6వ తేదీన టెండర్లను పిలిచారని, 16వ తేదీ వరకు సీల్డ్ టెండర్లను ఆహ్వానించారని పేర్కొంటున్నారు.

ఏ నిబంధనలు విధించారంటే..

గతంలో లేని విధంగా ఏ జిల్లాలో లేనివిధంగా నల్లగొండ జిల్లాలో టెండర్ల నిబంధనలు మార్చడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్‌లో పాల్గొనే వారు రూ.లక్ష ఈఎండీ చెల్లించాలని, ఫర్మ్ రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు రూ.10 కోట్ల టర్నోవర్ చేండాలని, 3 సంవత్సరాల అనుభవం కలిగిన వారు అర్హులని టెండర్‌లో పేర్కొన్నారు. ఫర్మ్ బ్లాక్ లిస్టులో లేదని పేర్కొంటూ రూ.100 బాండ్ పేపర్‌పై నోటరీ సమర్పించాలని సూచించారు. మూడేళ్ల ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్, ఫర్మ్ వ్యాట్, జీఎస్టీ ధ్రువీకరణ పత్రం, రూ.10 కోట్ల టర్నోవర్ ఉన్నట్లుగా అగ్‌మార్క్ సర్టిఫికెట్, రూ.10 కోట్లకు సాల్వెన్సీ సర్టిఫికెట్, గుడ్లు సరఫరా చేసేవారైతే ఎన్ఈసీసీ వారిచే జారీచేసిన పర్మిట్ ధ్రువీకరణ పత్రం, మాంసం, చికెన్, కూరగాయలు సరఫరా చేసేవారు మున్సిపల్, గ్రామ పంచాయతీల నుంచి పొందిన లైసెన్స్ పత్రాలతో పాటు పాన్‌కార్డు, ఫుడ్‌లైసెన్స్ సర్టిఫికెట్ ఆధార్ కార్డు సమర్పించాలని పెట్టారు. ఇలాంటి నిబంధనల ప్రకారం జిల్లాలో ఒకరిద్దరు కాంట్రాక్టర్లే ఉన్నారని, వారికి మేలు చేసేందుకు ఓ నాయకుడి ప్రమేయంతో ఈ నిబంధనలను రూపొందించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

గురుకులాల సరఫరా పనులు కూడా వారికే అప్పగించేలా..

ఈ నిబంధనలతో ప్రస్తుతం కేజీబీవీ పనులను అప్పగిస్తే మరిన్ని రూ.కోట్ల విలువైన ఎస్సీ, బీసీ గురుకులాల్లో సరుకుల సరఫరా పనులను కూడా వారికే అప్పగించవచ్చనే ముందుచూపుతో ఈ తతంగం నడిపినట్లు తెలుస్తోంది.

మూసీకి 810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



మూసీ రిజర్వాయర్

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. హైదరాబాద్ నగరంతోపాటు, మూసీ పరీవాహక ప్రాంతాల్లో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో చేరుతుంది. గురువారం ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి శుక్రవారం 810 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. మూసీ పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 638.50 అడుగులకు చేరుకుందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 2.88 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 370 మందికి 56 మంది గైర్హాజరు



హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు

నల్లగొండ: డీఎస్సీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌వీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సెంటర్‌లో సీబీటీ (కంప్యూటర్ బేస్డ్ టెస్టు) విధానంలో పరీక్ష కొనసాగింది. ఈ కేంద్రానికి మొత్తం 4,440 మంది అభ్యర్థులను కేటాయించారు. రోజు ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో ఒక్కో పరీక్షకు 185మంది చొప్పున అభ్యర్థులను కేటాయించారు. 12 రోజుల పాటు ఆగస్టు 5 వరకు పరీక్షలు జరుగనున్నాయి. గురువారం మొదటి రోజు ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్ పరీక్ష జరిగింది. 185 మందికి 154 మంది పరీక్షకు హాజరు కాగా 31 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు జరిగిన రెండో సెషన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షకు 185 మందికి160 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజయ్యారు. డీఈఓ బొల్లారం భిక్షపతి పర్యవేక్షణలో సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య, హెచ్ఎం సైదానాయక్ పరిశీలకులుగా వ్యవహరించారు.

ఆగస్టు 5 వరకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో ఎస్‌వీఆర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డీఎస్సీ పరీక్ష కేంద్రం వద్ద ఆగస్టు 5 వరకు పటిష్ట బందోబస్తుకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కేంద్రం సమీపంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు తీయడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయాలని తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులను ప్రతి రోజు మెటల్ డిటెక్టర్లతో తనిఖీ చేయడానికి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

మిర్యాలగూడ బాలుడికి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



కలెక్టర్ చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న రేయాన్ష్

మిర్యాలగూడ: మిర్యాలగూడకు చెందిన ఓరుగంటి పవన్‌కుమార్, రూపరేణుక దంపతుల కుమారుడు ఓరుగంటి రేయాన్ష్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. రేయాన్ష్ పలు దేశాల పేర్లు, జంతువులు, పక్షులు, గ్రహాల పేర్లతో పాటు జనరల్ నాలెడ్జ్, జాతీయ చిహ్నాలకు సంబంధించి 15 నిమిషాల్లో 150కు పైగా సమాధానాలు చెప్పి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. నల్లగొండ జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి చేతుల మీదుగా రేయాన్ష్ గురువారం మెడల్, సర్టిఫికెట్ అందుకున్నాడు.

గుట్కా కేసులో ఇద్దరి రిమాండ్

మిర్యాలగూడ అర్బన్: ప్రభుత్వం నిషేధించిన గుట్కా ప్యాకెట్లు నిల్వ చేసిన ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్‌రాజు గురువారం విలేకరులకు వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని పెద్దబజారులో గల రెండు షాపుల్లో నిషేధిత గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉన్నట్లు అందిన సమాచారంతో ఈ నెల 16వ తేదీన వన్‌టౌన్ సీఐ సుధాకర్, ఎస్ఐ శ్రీనునాయక్, పోలీస్ సిబ్బంది కలిసి దాడులు నిర్వహించగా రూ.11లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు లభ్యమైనట్లు డీఎస్పీ తెలిపారు. పెద్దబజారుకు చెందిన గోపారపు రాజు, ఆకుతోట నర్సింహను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించి నగదు బహుమతి ప్రకటించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ సీజ్

కోదాడరూరల్ : ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా తెలంగాణలోకి ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం కోదాడ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా నందిగామ ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కోదాడకు టిప్పర్‌లో ఇసుకను తీసుకొస్తుండగా.. కాపుగల్లు క్రాస్ రోడ్ వద్ద పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. టిప్పర్ డ్రైవర్ కాసర్ల శ్రీనివాసరావుతో పాటు ఓనర్ తోకల అరుణకుమారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముస్తాబవుతున్న 'ఆంథోల్ మైసమ్మ'

- 20, 21, 22 తేదీల్లో ఆలయ బ్రహ్మోత్సవాలు

చౌటుప్పల్: మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామ శివారులో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి వెంట ఉన్న శ్రీఆంథోల్ మైసమ్మ ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ దేవాలయంలో ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో 19వ వార్షిక బ్రహ్మోత్సవాలను దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి పదవీకాలం ఇప్పటికే ముగిసినప్పటికీ నూతన కమిటీ ఏర్పాటు చేయలేదు. అయితే ఉత్సవాల నిర్వహణ కోసం తాత్కాలికంగా ఉత్సవ కమిటీని నియమించారు. ఈ ఉత్సవాలు దేవాదాయశాఖతో పాటు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

వివిధ ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తులు..

బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారు. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో ముస్తాబు చేస్తున్నారు.



ఆంథోల్ మైసమ్మ ఆలయం



ఆంథోల్ మైసమ్మ అమ్మవారు

ఈ ఏడాది భక్తుల సంఖ్య మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. బ్రహ్మోత్సవాలలో పాల్గొనేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాదాయశాఖ, ఉత్సవ కమిటీ అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజుల పాటు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఆకట్టుకోనున్న బోనాలు..

బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించే బోనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలువనుంది. వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు వేలాదిగా తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. బోనాలు నిర్వహించే రోజున ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోతాయి.

ఏర్పాట్లు చేస్తున్నాం



బ్రహ్మోత్సవాల పనులు ప్రారంభించాం. భక్తులకు ఎలాంటి లోటు లేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. గతేడాదితో పోలిస్తే ఈసారి భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ప్రణాళికాబద్ధంగా పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం.

– ఎస్. మోహన్‌బాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి

రైతుల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు: రాష్ట్రంలోని రైతుల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రూ.2లక్షల రైతు రుణమాఫీ అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మునుగోడు మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. అనంతరం డప్పుచప్పుళ్లతో ఎండ్ల బండిపై రైతువేదిక వరకు ర్యాలీగా వెళ్లి టెలీకాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల ప్రసంగాలు విన్నారు. ఈ సందర్భంగా కుంభం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేత మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని అన్నారు. అంతేకాకుండా త్వరలో పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి సాయం కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఎల్లయ్య, తహసీల్దార్ ఎం. నరేందర్, ఎంపీడీఓ పూజ, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కర్నాటి స్వామి, వేమిరెడ్డి జితేందర్‌రెడ్డి, పాల్వాయి చెన్నారెడ్డి, మిర్యాల వెంకన్న, జాల వెంకన్నయాదవ్, జాజుల అంజయ్య గౌడ్, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, సాగర్ల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులో ఎడ్ల బండి ర్యాలీ నిర్వహిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

యాదాద్రీశుడు మా ఇలవేల్పు

- సినీ నటుడు తనికెళ్ల భరణి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి తమ ఇంటి ఇలవేల్పు అని సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం యాదాద్రీశుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నతనం నుంచి ఇప్పటి వరకు 15 సార్లకు పైగా యాదాద్రీశుడిని దర్శించుకున్నట్లు ఆయన వెల్లడించారు. యాదాద్రి ఆలయాన్ని తిరుమల తిరుపతి స్థాయిలో అద్భుతంగా పునర్నిర్మించారని అన్నరాఉ. అంతకుముందు తనికెళ్ల భరణితో పాటు ఆయన కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



యాదగిరిగుట్ట: తనికెళ్ల భరణి, కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

స్వర్ణగిరి శ్రీవారికి తిరుప్పావడ సేవ..

భువనగిరి: పట్టణంలోని స్వర్ణగిరి ఆలయంలో గురువారం వేంకటేశ్వరస్వామికి తిరుప్పావడ సేవ నిర్వహించారు. అంతకుముందు ఉదయం సహస్ర నామార్చన, నిత్య కల్యాణ మహోత్సవాన్ని పురోహితులు నిర్వహించారు. సినీ నటుడు తనికెళ్ల భరణి తన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికి ప్రసాదం అందజేశారు.

పార్థి గ్యాంగ్‌లో మరో సభ్యుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ క్రైం: దారి దోపిడీలకు పాల్పడుతూ ప్రతిఘటించిన వారిని హత్య చేస్తున్న పార్థి గ్యాంగ్‌లోని మరో సభ్యుడిని నల్లగొండ పోలీసులు మహారాష్ట్రలో అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి గురువారం తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 6వ తేదీన పార్థి గ్యాంగ్‌కు చెందిన అప్పా పాండురంగ, శుభం అశోక్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారించగా.. రాజ్‌కపూర్ త్రిభువన్ అలియాస్ రాజ్‌కుమార్ తమ ముఠాలో సభ్యుడిగా ఉన్నట్లు వారు తెలిపారు. వారిచ్చిన సమాచారం మేరకు నల్లగొండ పోలీసులు మహారాష్ట్రలోని సాంగ్లి జిల్లా మీరజ్ రూరల్ పీఎస్ పరిధిలోని మాల్గావ్ గ్రామంలో రాజ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి ఇక్కడకు తీసుకొచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముఠా సభ్యులు తెలంగాణ ప్రాంతంలో దోపిడీలు చేసేందుకు ప్లాన్ చేశారని డీఎస్పీ పేర్కొన్నారు. వీరు ఇటీవల కట్టంగూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విజయవాడ–హైదరాబాద్ హైవే వెంట డీసీఎంలో నిద్రించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా పామర్రు మండలం చాట్లవానిపురం గ్రామానికి చెందిన కొల్లూరి రాజవర్ధన్ చేతులు కట్టేసి అతడిపై దాడి చేసి రూ.14,500 దోచుకున్నారని, అదేవిధంగా పామనగుండ్ల గ్రామంలో హోండా షైన్ బైక్ దొంగిలించి, ఆరు బయట నిద్రిస్తున్న వారి బంగారు ఆభరణాలు దోచుకెళ్లారని తెలిపారు. ముఠా సభ్యులు చేసిన చోరీల్లో ఆధారాలు సేకరించి అరెస్ట్ చేశామన్నారు. రాజ్‌కుమార్‌పై మొత్తం 9 కేసులు, రాచకొండ కమిషనరేట్ పరిధిలో 5 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న టీంలో నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయగౌడ్, చిట్యాల ఎస్ఐ సైదాబాబు, నకిరేకల్ ఎస్ఐ సుధీర్, హెడ్‌కానిస్టేబుల్ విష్ణువర్ధన్‌గిరి, పాష, ఖలీల్, అఫ్జల్ ఉన్నారు.

జూనియర్ కళాశాలలో డీఐఈఓ విచారణ



కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సూర్యాపేట డీఐఈఓ క్రిష్ణయ్య

ఆత్మకూర్(ఎస్): మండల పరిధిలోని నెమ్మికల్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4లక్షల నిధుల గోల్‌మాల్‌పై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై గురువారం సూర్యాపేట జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి(డీఐఈఓ) క్రిష్ణయ్య విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 2016 నుంచి జూనియర్ కళాశాలకు మంజూరైన నిధులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కళాశాలకు అంత పెద్ద మొత్తంలో ఎప్పుడూ నిధులు విడుదల కాలేదని డీఐఈఓ అన్నారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ రాకేంద్, కళాశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన అమెరికా విద్యార్థిని

అర్వపల్లి: అమెరికాకు చెందిన దీక్ష అనే విద్యార్థిని గురువారం జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించింది. అక్కడ 12వ గ్రేడ్ చదువుతున్న దీక్ష ఇంటర్న్‌షిప్‌లో భాగంగా బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ అధినేత షేక్ చాంద్‌పాష సౌజన్యంతో సంస్థ ప్రతినిధి, స్థానిక ఫిజికల్ డైరెక్టర్ పి. మల్లేష్ ఆధ్వర్యంలో పాఠశాలను సందర్శించింది. ఈ సందర్భంగా ఆమె పరిసర ప్రాంతాల్లో దొరికే వస్తువులు, కట్టె పుల్లలతో ఇన్నోవేటివ్ వస్తువులు తయారుచేసి చూపించారు. అదేవిధంగా 100మంది పిల్లలకు సంస్థ సభ్యుడు దీపక్ ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. విజయలక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు, పీడీ పి. మల్లేష్, ఉపాధ్యాయులు మధుకర్, శ్రీరాములు, రమేష్, వీరన్న, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో అమెరికా దేశ విద్యార్థిని దీక్ష

హాకీ నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపిక

చిట్యాల: నల్లగొండ పట్టణానికి చెందిన ఇద్దరు విద్యార్థులు హాకీ ఇండియా సెకండ్ సబ్ జూనియర్ మెన్ నేషనల్ చాంపియన్‌షిప్–2024కు ఎంపికై నట్లు హాకీ అసోసియేషన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కూతరు వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమామ్ కరీం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన నేషనల్ సెలక్షన్స్‌లో నల్లగొండ పట్టణంలోని స్రవంతి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోగుల అఖిల్, గౌతమి జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న కుంచెం రాకేష్ పాల్గొని నేషనల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు కేరళలో జరగనున్న నేషనల్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. వారిని హాకీ అసోసియేషన్ యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల కార్యదర్శులు బోనగిరి శ్రీనివాసులు, లింగయ్యయాదవ్, ఉపాధ్యక్షుడు దావూద్ అలీ, హాకీ కోచ్ యువర్ అభినందించారు.



కుంచెం రాకేష్



గోగుల అఖిల్

వ్యాస మహర్షి పురస్కారానికి ఎంపికైన ఉపాధ్యాయులు

చండూరు: చండూరు మండల కేంద్రానికి చెందిన మద్దోజు వెంకట సుధీర్‌బాబు, చండూరు మండలం అంగడిపేట గ్రామానికి చెందిన డాక్టర్ ఇడికుడ సచ్చిదానంద వ్యాస మహర్షి పురస్కారానికి ఎంపికై నట్లు హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్, తెలంగాణ ప్రాంత అధ్యక్షుడు రాఘవేంద్రచారిలు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుధీర్‌బాబు చండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా, డాక్టర్ సచ్చిదానంద హైదరాబాద్‌లో తెలుగు ఉధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరు ఈ నెల 21న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ పట్టణంలోని టీజీవీ కళాక్షేత్రంలో వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకొని ఈ పురస్కారాలు అందుకోనున్నారు.

యూటీఎఫ్ మాజీ అధ్యక్షుడు మృతి



బలరాం (ఫైల్)

నల్లగొండ: చిట్యాల మండలం తాళ్లవెల్లెంల గ్రామానికి చెందిన ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు నల్లబెల్లి బలరాం అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. బలరాం కుటుంబ సభ్యులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సంతాపం తెలియజేశారు. 1983 జూలైలో బలరాం మునుగోడు సమితిలో ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. నారాయణపురం మండల యూటీఎఫ్ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడిగా బలరాం 2004 నుంచి 2008 వరకు పనిచేశారు. బలరాం భార్య గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తోంది.

మూడు ఇళ్లలో చోరీ

గరిడేపల్లి: మండల కేంద్రంలో బుధవారం రాత్రి తాళం వేసిన మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గరిడేపల్లి మండల కేంద్రానికి రైస్ మిల్లు యాజమాని రామచంద్రరావు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి బెంగళూరులో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. అదేవిధంగా ఖాజామొహినొద్దీన్ కుటుంబంతో కలిసి మొహర్రం పండుగకు కోదాడకు వెళ్లారు. గట్టికొప్పుల సత్యనారాయణరెడ్డి కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లారు. ఈ మూడు ఇళ్లకు తాళాలు వేసి ఉండటం గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రామచంద్రరావు ఇంట్లో సుమారు రూ.1.50లక్షల నగదు ఎత్తుకెళ్లినట్లు అతడి కుటుంబ సభ్యులు తెలిపారు. ఖాజామొహినొద్దీన్ ఇంట్లో తులం బంగారం, గట్టికొప్పుల సత్యనారాయణరెడ్డి ఇంట్లో రూ.3వేలు నగదు ఎత్తుకెళ్లారు. అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు తచ్చాడుతుండగా స్థానికుడు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు పెట్రోలింగ్ వాహనం సైరన్ వేసుకొని రావడంతో దొంగలు పరారైనట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దొంగతనం జరిగిన ఇళ్లను హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ ఈట సైదులు పరిశీలించారు.



ఆధారాలు సేకరిస్తున్న సీఐ చరమందరాజు

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పెద్దవూర: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన గురువారం పెద్దవూర మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్ద జరిగింది. మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్‌రాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం రామన్నగూడెం తండాకు చెందిన బాణావత్ నానుకు(55)కి 30ఏళ్ల క్రితం ఆంధ్రా ప్రాంతానికి చెందిన బాణావత్ కృష్ణతో వివాహం జరిగింది. 25ఏళ్ల క్రితం వారికి కుమార్తె జన్మించగానే నానుకుని ఆమె భర్త వదిలి వెళ్లిపోయాడు. దీంతో కొన్నిరోజులు తన తల్లిగారి ఊరైన పెద్దవూర మండలం రామన్నగూడెంతండాలో ఉంది. ఆ తర్వాత పెద్దవూర మండల కేంద్రంలోని వైజంక్షన్ వద్దకు మకాం మార్చి ఇక్కడే కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తన కుమార్తెకు సైతం వివాహం కావడంతో ప్రస్తుతం నానుకు తనకున్న రెండు షెట్టర్లను కిరాయికి ఇచ్చి ఇంటి వెనకభాగంలో ఉన్న గదిలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో గురువారం షెట్టర్‌లో కిరాయికి ఉండే మస్తాన్ మధ్యాహ్నం అయినా ఇంట్లో నుంచి నానుకు బయటకు రాకపోవడంతో ఆమెకు ఫోన్ చేశాడు. ఎంతకూ ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో ఆమె ఉండే గదికి వెళ్లి చూసేసరికి మంచంపై అనుమానాస్పదంగా మృతిచెంది ఉంది.



వివరాలు తెలుసుకుంటున్న మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు

వెంటనే ఇంటిపక్కల వారికి, ఆమె కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నానుకు మృతదేహాన్ని పరిశీలించారు. ఇంటి తలుపులు తీసి ఉంచడం, ఒక కాలుకు వెండి పట్టీ లేకపోవడం, ముక్కు నుంచి నురగ వస్తుండటంతో నానుకుని ఎవరో హత్య చేశారని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు నల్లగొండ నుంచి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రప్పించారు. డాగ్ స్క్వాడ్ రెండుసార్లు మృతురాలు ఇంటి నుంచి జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారి వెంట కిలోమీటరున్నర దూరంలో ఉన్న స్వాతి హోటల్ వరకు వెళ్లి ఆగిపోయింది. క్లూస్ టీం బృందం మృతదేహాన్ని, ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు నాగార్జునసాగర్ సీఐ భీషన్న పర్యవేక్షణలో ఎస్ఐ పి. వీరబాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. నానుకు మృతదేహాన్ని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ ఎంపీపీ రమావత్ శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరి సందర్శించి నివాళులర్పించారు.



నానుకు (ఫైల్)

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ..

మిర్యాలగూడ డీఎస్పీ కె. రాజశేఖర్‌రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సీఐ, ఎస్ఐలతో మాట్లాడి క్లూస్ టీంతో కలిసి వివరాలు సేకరించారు. మృతురాలి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, ఆమె ఒంటిపై, ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలు అన్ని సక్రమంగానే ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తిస్థాయి విచారణలో అసలు విషయాలు తెలుస్తాయని తెలిపారు.

పెసరలో తెగుళ్లు – నివారణ చర్యలు

నడిగూడెం: ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సాగుచేసిన పెసర పంట చాలా చోట్ల పూత, పిందె దశలో ఉంది. వర్షాల కారణంగా వాతావరణంలో తేమ ఉండడంతో ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు చెబుతున్నారు. పెసర సాగుకు సంబంధించిన సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే..

ఆశించే పురుగులు

- **చిత్తపురుగులు** : ఈ పురుగులు పైరుపై రెండు ఆకుల దశలో ఆశించి రంధ్రాలు చేస్తాయి. నీటి ఎద్దడ ఎక్కువగా ఉన్నప్పుడు నివారించకపోతే 80 శాతం మొక్కలు ఈ దశలోనే చనిపోతాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా మోనోక్రోటోఫాస్ 1.5. మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **తామర పురుగు** : ఈ పురుగులు తొలి దశలో లేత ఆకులపై వృద్ధిచెంది ఆకుల అడుగు నుంచి రసాన్ని పీలుస్తాయి. వీటి వల్ల ఆకుముడత వైరస్ వ్యాధి కూడా వ్యాపిస్తుంది. పంటకు 15–20 శాతం నష్టం కలుగుతుంది. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.



నడిగూడెం మండలం నారాయణపురంలో సాగులో ఉన్న పెసర పంట



పాడి పంట

- **తెల్లదోమ** : ఈ పురుగులు ఆకుల్లోని రసాన్ని పీలుస్తాయి. అంతేకాక ఎల్లోమొజాయిక్ అనే వైరస్ వ్యాధి (పల్లాకు తెగులు) కూడా వ్యాపింపచేస్తాయి. వీటి నివారణకు మోనోక్రోటోఫాస్ 1.5 మి.లీ, లేదా మిథైల్ డెమటాన్ 2.0 మి.లీ. లేదా ట్రైజోఫాస్ 2.0 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **పొగాకు లద్దె పురుగు** : ఈ పురుగులు ఆకుల్లోని పచ్చని పదార్థాన్ని గీరి తినడం వలన ఆకులు తెల్లగా కన్పిస్తాయి. ఆకులకు రంధ్రాలు చేసి, ఆకులను పూర్తిగాను, పువ్వులను. పిందెలను కూడా తింటాయి. ఈ పురుగులు రాత్రి పూట ఎక్కువగా నష్టపరుస్తుంటాయి. ఈ పురుగుల నివారణకు గుడ్ల సమూదాయాలను ఏరివేయాలి. జల్లెడగా మారి పిల్ల పురుగులతో ఉన్న ఆకులను ఏరి నాశనం చేయాలి. ఎకరాకు 30 వేల ట్రైకోగ్రామ బదనికలను వారం తేదాతో 2 పర్యాయాలు వదలాలి. ఎకరాకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి, పురుగు ఉధృతిని గమనించాలి. మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఆశించే తెగుళ్లు

- **సర్కోస్పోరా ఆకుమచ్చ తెగులు** : ఈ తెగులు సోకిన ఆకులపై గోధుమ రంగు గుండ్రని చిన్నచిన్న మచ్చలు కనిపించి అనుకూల వాతావరణ పరిస్థితులలో ఈ మచ్చలు పెద్దవై ఆకులు ఎండి రాలిపోతాయి. దీని వలన కాయల్లో గింజలు సరిగ్గా నిండవు. దీని నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా కార్బెండిజమ్ 1 గ్రాము లేదా క్లోరోథలోనిల్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **బూడిద తెగులు** : ఈ తెగులు విత్తిన 30–35 రోజుల తర్వాత గాలిలో తేమ ఎక్కువగా ఎన్నప్పుడు, ముదురు ఆకులపై, బూడిద రూపంలో చిన్నచిన్న మచ్చలు కనబడి క్రమేపీ పెద్దవై ఆకలపైన, క్రింద భాగాలకు మరియు కొమ్మలు, కాయలకు వ్యాపిస్తుంది. దీని నివారణకు కార్బెండిజమ్ 1 గ్రాము లేదా థయోఫానేట్ మిథైల్ 1 గ్రాము లేదా డీనోక్యాప్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **బ్యాక్టీరియల్ లీఫ్ బ్లైట్** : ఈ తెగులు సోకిన మొక్కల ఆకులపై గోధుమ వర్ణంలో చిన్నచిన్న మచ్చలు కనిపిస్తాయి. ఈ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు మరియు 100 మి.గ్రా. ప్లాంటోమైసీన్ కలిపి 12 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- **పల్లాకు తెగులు** : ఇది వైరస్ జాతి తెగులు. ఈ తెగులు సోకిన మొక్కలు ఆకులు, కాయల మీద పసుపు మచ్చ పారలు ఏర్పడతాయి. ఈ తెగులు తెల్లదోమ ద్వారా వ్యాపిస్తుంది. తెల్లదోమ నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా డైమీథోయేట్ 2. మి.లీ. లేదా ట్రైజోఫాస్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.